క్లుప్తంగా

నేడు దరఖాస్తుల స్వీకరణ

కేటీదొడ్డి: మండలంలోని కుచినెర్ల, ఈర్లబండ, వెంకటాపురం గ్రామ పంచాయతీల్లో మంగళవారం ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తహసీల్దార్ సరితారాణి, ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహీద్దీన్, సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

మట్టికుప్పను తొలగించండి



అయిజ: పట్టణంలోని ఉప్పల దొడ్డి పేటలో చౌరస్తాలో నడి రోడ్డుపై 15 రోజుల క్రితం మట్టికుప్పను వేయడంతో ప్రమాదాలకు కారణమవుతోంది. గత నెలలో ట్రాక్టర్ టైర్‌కు పంచర్ కావడంతో మట్టిని అక్కడే వదిలేసి ట్రాక్టర్‌ను తీసుకెళ్లారు. ఇప్పటి వరకు మట్టిని అక్కడ నుంచి తరలించలేదు. ప్రధాన రోడ్డుపై మట్టి కుప్ప అడ్డుగా ఉండడంతో ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుండుగులపై చర్యలు తీసుకోండి



అయిజ: మండలంలోని మేడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత నెల 30వ తేదీ రాత్రి గుర్తు తెలియని దుండగులు పాఠశాల గదుల తలుపులు విరగొట్టి ఆట వస్తువులను అపహరించి, కొన్ని వస్తువులను విధ్వంసం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని పాఠశాల హెచ్‌ఎం కర్రెప్ప సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మేడికొండ పాఠశాల మన ఊరు–మన బడి పథకానికి ఎంపికైందని, రూ.10 లక్షల విలువ చేసే డిజిటల్ బోర్డులు, గ్రీన్ బోర్డులతో పాటు వివిధ వస్తువులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో దుండగులు వీటిని కూడా అపహరించే ప్రమాదం ఉందని, పాఠశాలకు నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని హెడ్ మాస్టర్ పోలీసులను కోరారు.

నేడు పచ్చర్ల, నసనూరులో ప్రజాపాలన


రాజోళి: మండలంలోని పచ్చర్ల, నసనూరు గ్రామాల్లో సోమవారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించున్నారు. ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఐదు గ్యారంటీలకు ఇందులో దరఖాస్తులు తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఆదివారం, సోమవారం సెలవుల అనంతరం మంగళవారం రెండు గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం



ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలో సోమవారం ప్రధాని చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. అయోధ్యలో నిర్మించిన నూతన అంతర్జాతీయ విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టడంతో అలంపూర్ వాల్మీకి సంఘం అధ్యక్షుడు నారాయణ నాయుడు ఆధ్వర్యంలో ఎర్రవల్లి చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోది చిత్రపటానికి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌రెడ్డి, సత్యం, నారాయణ నాయుడు, సాయిబాబ, సంపత్, తిమ్మన్న, రవి, వాసు, నాగేష్, పరుశ, సత్యం, మధు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మారుద్దాం



శాంతినగర్: వడ్డేపల్లి ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని శాంతినగర్ సేవా సమితి వడ్డేపల్లి సభ్యులు పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. శాంతినగర్ రామచంద్రానగర్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ బట్ట సంచులు పంపిణీ కార్యక్రమాన్ని సేవాసమితి సభ్యులు సోమవారం చేపట్టారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు బట్ట సంచులను వెంట తీసుకెళ్లే అలవాటు చేసుకోవాలని ప్రజలకు, దుకాణాదారులకు వివరించారు. గతే దాది ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, బట్ట సంచుల పంపిణీతో కొందరు వ్యక్తులు మారినట్లు తెలిపారు. మిగతా వారు కూడా ప్లాస్టిక్ నిర్మూలన కోసం బట్ట సంచుల వాడకాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, దాసు వరం నాగరాజు, ఖాజా పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేడుకలు



పరుమాల చర్చిలో కేక్‌కట్ చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత



అలంపూర్‌లో న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ యువకుల కేరింతలు

- అర్ధరాత్రి కేక్‌కట్ చేసిన యువకులు
- డీజే డ్యాన్స్‌లు, పేల్చిన టపాసులు
- ఉదయం కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు చేసిన ప్రజలు
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

గద్వాల: కొత్త ఆశలు.. ఆశయాలు, ఆలోచనలు.. కొత్త లక్ష్యాలు.. గమ్యాలు.. కోటి కాంతులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. గద్వాల జిల్లా ప్రజలు ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులతో మహిళలు కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. పట్టణంలోని ప్రతి ఇంట్లో, యువకులు, ప్రైవేటు కార్యాలయాల్లో కేక్ కట్ చేశారు. పట్టణ శివారు ప్రాంతాల్లో యువకులు మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేసుకున్నారు.

కిక్కిరిసిన ప్రార్థన మందిరాలు

సోమవారం తెల్లవారుజాము నుంచే పట్టణంలోని ఆలయాలు కిటకిటలాడాయి. స్థానిక కోటలోని చెన్నకేశవస్వామి, సాయిబాబ ఆలయం, రాఘవేంద్ర స్వామిమఠం, కన్యకాపరమేశ్వరి, సంతాన వేణుగోపాలస్వామి, అయ్యప్పస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అలంపూర్ జోగుళాంబ, మల్దకల్ శ్రీస్వయం భూలక్ష్మీ వేంకటేశ్వర స్వామి, పాగుంట శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వా మి, చింతరేవుల ఆంజనేయస్వామి, బీచుపల్లి శ్రీ ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక ఎంబీ మిస్పా చర్చిలో కేక్‌కట్ చేశారు.

గద్వాల అర్బన్: జెడ్పీచైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో జెడ్పీచైర్‌పర్సన్ సరితకు కాంగ్రెస్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పరుమాలలోని ఎంబీ బేతన చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీచైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో బీసీ సేనకు సంబంధించిన 2024 క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు, మిఠాయిలు పంచిపెడుతూ సంబరాలు చేశారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో కొత్త సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయాల్లో, చర్చిల్లో ప్రార్థనలు చేశారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల, ఎర్రవల్లి మండలాల్లోని ఆయా గ్రామాలలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. షేకుపల్లిలో ఎంపీపీ స్నేహ కేక్‌కట్ చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ఎమ్మెల్యే విజయుడికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు



మల్దకల్ ఆలయంలో భక్తుల పూజలు



బీచుపల్లిలో రామాలయంలో..



బీచుపల్లిలో శివాలయంలో..



శాంతినగర్‌లో..



ఎర్రవల్లిలో ప్రత్యేక ప్రార్థనలు

ఇంటింటికీ అయోధ్య అక్షతల పంపిణీ



శాంతినగర్‌లోని ఆలయంలో అక్షతల పంపిణీ



గట్టులో అక్షతలను ఊరేగిస్తున్న భక్తులు

శాంతినగర్: అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో సోమవారం గడప గడపకు పంపిణీ చేశారు. శాంతినగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ రావూరి సురేష్‌కుమార్, ఆయా కాలనీల్లో శ్రీవారి సేవకులు గాయత్రి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అక్షతల పంపిణీ చేశారు.

గట్టు: అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ అక్షతలను శ్రీరామ భక్తులు సోమవారం గట్టులో ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికి పంపిణీ చేశారు. ఆరగిద్ద గ్రామంలో అక్షతలను భాజాభజంత్రీలతో ఊరేగించి పంపిణీ చేశారు. 22న సాయంత్రం ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించాలని శ్రీ రామ భక్తులు తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని శివాంజనేయస్వామి ఆలయం నుంచి పలు గ్రామాలకు అయోధ్య రా మ మందిరం నుంచి వచ్చిన అక్షతలను పంపిణీ చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షతలను గ్రామాలకు తీసుకెళ్లారు.

వాల్మీకి గుడి నిర్మాణానికి భూమి పూజ

గట్టు: మండలంలోని బల్గెరలో సోమవారం గ్రామ ఊర చావిడి, వాల్మీకి మహర్షి గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడులు దంపతులు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రూపావతి, మాజీ సర్పంచులు నారాయణరెడ్డి, మొగిలి తిమ్మప్ప, సామేలు, ఉప సర్పంచ్ హనుమంతు పాల్గొన్నారు.



పశువైద్యుల కొరత!

- మూతపడుతున్న పశువైద్య కేంద్రాలు
- మందులు లేక ఇబ్బందులు పడుతున్న గొర్రెల కాపరులు
- పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

మల్దకల్: జోగుళాంబ గద్వాల జిల్లాలో పశువైద్యులు లేక మూగజీవాలకు వైద్యం అందక గొర్రెల కాపరులు పశువుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 13 మండలాలలోని పశు వైద్య కేంద్రాలకు 19 డాక్టర్లు ఉండాల్సి ఉండగా, 6 మంది మాత్రమే ఉన్నారు. దీంతో సిబ్బంది లేక పశు వైద్య కేంద్రాలు మూతపడ్డాయి. మండలంలో రెండు పశువైద్య కేంద్రాలతో పాటు ఆరు పశువైద్య ఉపకేంద్రాలున్నాయి. వాటికి మొత్తం 16 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఆరుగురు మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మల్దకల్ పశువైద్య కేంద్రానికి డాక్టర్ వినయ్‌కుమార్ కేటీదొడ్డి మండల పశువైద్య కేంద్రం నుంచి డిప్యూటేషన్‌పై వచ్చారు. పాల్వాయిలో పని చేస్తున్న డాక్టర్ యామినిసాయి గద్వాల జిల్లా కేంద్రంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తుండంతో పాల్వాయి పశువైద్య కేంద్రానికి సైతం డాక్టర్ లేక మూతపడింది. ఉన్న సి బ్బంది కూడా సక్రమంగా తమ విధులకు రాకపోవడంతో గొర్రెల కాపరులు పాడిపశువుల రైతులు ప్ర తిరోజు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వేలరూపాయల ఖర్చు చేసుకోవల్సిన పరిస్థితులు దాపురించాయని రైతులు, గొర్రెల కాపరులు ఆవేదన వ్యక్తం చేశారు. బిజ్వారం, విఠలాపురం, మద్దెలబండ గ్రామాలలో పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరడంతో ఉన్న సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 25,628 వేల గొర్రెలు, 15,136 పశువులు ఉన్నాయి. వాటిలో పశువులకు ఏడాదికి రెండు సార్లు, గొర్రెలకు ఏడాదికి మూడుసార్లు నట్టలనివారణ మందులు పంపిణీ చేయాల్సి ఉంటుంది. పశువైద్య సిబ్బంది కొరతతో మూగజీవాలకు సరైన వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాల్వాయిలో రూ.25లక్షల వ్యయంతో నూతన బిల్డింగ్ నిర్మించినా వైద్యుడు లేకపోవడంతో మూతపడింది. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లే దని గొర్రెల కాపరులు, రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మూగజీవాల కు వైద్యం అందేవిధంగా వైద్య సిబ్బందిని నియమించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



బిజ్వారంలో డాక్టర్ లేకపోవడంతో పశువులకు వైద్యం చేస్తున్న సిబ్బంది



పాల్వాయిలో మూతపడిన పశువైద్య కేంద్రం

వైద్యులను నియమించాలి



పాల్వాయిలోని పశువైద్య కేంద్రానికి డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రూ.25లక్షలతో నూతన భవనాన్ని నిర్మించిన డాక్టర్లు లేకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా వైద్యుడిని ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలి.

– ఈదన్న, పాల్వాయి

పాడిరైతులకు ఇబ్బందులు



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పశువైద్య ఉపకేంద్రాలకు సిబ్బంది లేకపోవడంతో గొర్రెల కాపరులు, పశువుల యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోని సమస్యను తీర్చాల్సిన అవసరం ఉంది.

– గోవింద్, బిజ్వారం

చర్యలు తీసుకుంటాం



మండలంలోని వివిధ గ్రామాల్లో పశువైద్య సిబ్బంది కొరత వల్ల గొర్రెల కాపరులు, రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. వెంటనే ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– పీ వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్యాధికారి

మాచర్లలో ఆధ్యాత్మిక శోభ



ఆచలగురు మందిర భక్తుల ఊరేగింపు

గట్టు: వివిధ ప్రాంతాల భక్తులు రావడంతో మాచర్ల గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీ సద్గురు పూర్ణానందచంద్రశేఖరాచార్యుల 24వ వార్షిక పాదుక పూజా సందర్భంగా సోమవారం భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. ఆచల గురుపరంపరాచార్యుల శ్రీసద్గురు నిత్యానంద కస్వా దామోదరాచార్యుల ఆధ్వర్యంలో మల్లికార్జున్, నిర్మల దంపతులు శ్రీవారి షోడశోపచార పాదుకా పూజ మహోత్సవం నిర్వహించారు. ఉదయం మందిర అలంకరణ, లఘు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం మంతా గురుమూర్తి, వేణుగోపాలస్వామిచే గీతాపారాయణం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటుగా కర్ణాటక ప్రాంతంలోని వివిధ జిల్లాలకు చెందిన పండితులు, భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

కనుల పండువగా ఫైర్ క్యాంపు



మాంటిస్సోరిలో విద్యార్థుల ప్రదర్శన

అలంపూర్: మాంటిస్సోరి పాఠశాలలో ఫైర్ క్యాంపు వేడుకలు కనుల పండవగా నిర్వహించారు. అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరి పాఠశాలలో నాలుగు రోజులుగా వింటర్ ఫెస్ట్ పేరుతో వేడుకలు నిర్వహించారు. సోమవారం ఫైర్‌క్యాంప్‌ను నిర్వహించారు. వింటర్ ఫెస్ట్‌లో భాగంగా కార్టన్ రైజర్స్, ఇంగ్లీష్ నైట్, ఫన్‌గేమ్స్, మ్యాజిక్ షో, డాన్సింగ్ డాల్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల సమయం బాణాసంచా పేల్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు సంతోషంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. డైరెక్టర్ కెఎన్‌వీ రవిప్రకాష్, పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

భీమ్ కొరేగావ్ మహర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



గద్వాలలో విజయ్ దివస్ నిర్వహిస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: భీమ్ కొరేగావ్ మహర్ సైనికుల త్యాగాలు, విజయాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్ తరాలు మనువాదానికి వ్యతిరేకంగా పోరాడి సమ సమాజాన్ని నిర్మించాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. భీమ్ కోరేగావ్ విజయ్ దివస్ సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహవీరుల అంకితభావం, పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోని యువత సమాజంలో మతోన్మాదం, కులవివక్షత, అణిచివేత, హింసలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కార్యాలయంలో వివిధ సంఘాల నాయకులు ఇమ్మానియేల్, ప్రవీణ్‌కుమార్, హనుమంతు, వాల్మీకి, మోహన్, విజయ్‌కుమార్, కృష్ణ, ఆంజనేయులు, మన్నెం, దేవప్ప ఉన్నారు.



మాచర్లలో..

గట్టు: మండలంలోని మాచర్లలో భీమాకోరేగావ్ విజయ్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ అధ్వర్యంలో భీమాకోరేగావ్ విజయ్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో బల్గెర ఏసురాజు, సల్కాపురం ఆంజనేయులు, నర్సింహులు, బండారి సునంద్, చిన్నయ్య, శివరాజు, యేసురాజు, చంద్రాయుడు, మారెప్ప, శరణప్ప, లోకేష్, తిమ్మప్ప, డానియేలు, భీమేష్, యువరాజు తదితరులు పాల్గొన్నారు.

బడిలో ప్రొజెక్టర్ మూసివేత

ఉండవెల్లి: పాఠాలు నేర్పించే బడిలో ప్రొజెక్టర్‌ను మూసివేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల కోసం ప్రొజెక్టర్ ఉన్న లేన ట్లుగా మారింది. తరగతి గదిలో థర్మకోల్ దె బ్బతిన్న గదిలోనే సమావేశాలు పెడుతున్న పట్టింపు లేకుండా పోయిందని, తెర దించాలని విద్యార్థులు కోరుతున్నారు.

హరిత హారం చుట్టూ పిచ్చి మొక్కలు

మానవపాడు: మండలకేంద్రంలోని కార్యాలయంలో హరితహారం మొక్కలు నాటారు. ఆ మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. పట్టించుకునే నాథుడు లేరు. ఇ ప్పటికైనా అధికారులు చొరవ చూపి పిచ్చి మొక్కలను తొలగించి హరితహారం మొక్కలకు నీటి సదుపాయం అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా ఉర్సు

అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లిలో వెలసిన సయ్యద్ షా మహబూబ్ ఉస్సేనీ దర్గా ఉరోస్తవాలు సోమవారం ఘనంగా జరిగాయి. దర్గాలో ప్రత్యేక పాతేహా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు దర్గా షరీఫ్ వద్ద కందూర్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.